# పరుగో పరుగు

మల్లిక్

అది..... పక్షులు తూర్పునుండి పడమర దిక్కుకి ఎగిరేవేళ. అబ్బాయిలు నీటుగా క్రాపు దువ్వుకుని ముఖానికి వెల్లవేసినట్లు పౌడర్ పులిమేస్కుని రద్దీ బజార్లలో అమ్మాయిలకి ఫటఫటా డాష్‌లు కొట్టుకుంటూ వెళ్ళే వేళ.

జనంతో కిటకిడలాడే బస్‌స్టాపుల్లో గంటలతరబడి సిటీబస్సుల కోసం నిలబడలేకా, కాళ్ళు పీకుతుంటే జనం చూస్తుండగా ఫుట్ పాత్ మీద కూర్చోలేకా, నిలబడడానికి, కూర్చోడానికి మధ్య అవస్థలో జనం ఉన్నవేళ.

బస్సు వస్తే దానివెంట జనం పరుగో పరుగు... తీసేవేళ.

కొత్తగా పెళ్ళయిన అమ్మాయి భర్తకోసం గుమ్మంలో ఎదురు చూసే వేళ.

పెళ్ళయి చాలాకాలం అయిన భర్త బిక్కుబిక్కుమంటూ గుమ్మంలో అడుగు పెట్టేవేళ.

ఆ రోజు ... ఆ వేళలో చిక్కడపల్లిలోని ఒక ఇంట్లో... ఫొటో 'ఫినిష్'

రాజారాం ఆఫీసునుండి అప్పుడే గుమ్మంలోకి అడుగు పెట్టాడు.

'ఓహ్... తెచ్చేశారా!?' అంది సంతోషంగా ఎదురుచూస్తూ అతని భార్య సుశీల.

అతను ఆమె ప్రశ్నకి సమాధానం ఏమీ చెప్పలేదు. ఒక్కసారి భార్యవంక రుసరుస చూసి సోఫాలో కూలబడి షూస్ లేసులు విప్పుకోసాగాడు.

ఆమె రెండుకాళ్ళు నేలకేసి ఫటఫట కొడుతూ చేతులు రెండూ పైకీ కిందకీ ఊగిస్తూ 'ఊహూ...ఊహు... తేలేదు కదూ?' అంది గారాలు పోతూ.

రాజారాం పళ్ళు కొరికాడు.

"ఏంటి...ఏం తేవాలి??'

"అదేంటి పొద్దున్న ఫోటోస్టూడియో కార్డు ఇచ్చానుగా...ఫొటో తేలేదా?' అంది సుశీల కాళ్ళు నేలకేసి కొట్టడం మాని ఆశ్చర్యంగా చూస్తూ.

"ఊ......అయితే ఆ ఫోటోకోసం అంత ఇదిగా ఎదురుచూస్తున్నా వన్నమాట...' అన్నాడతను మళ్ళీ పళ్ళుకొరుకుతూ.

'ఇప్పుడేంటి... పొద్దున్న మీరు ఆఫీసుకు వెళ్ళిన దగ్గర్నుంచీ ఎదురుచూస్తున్నా...ఎప్పుదెప్పుడు ఆ ఫొటో తెస్తారా అని...'

'ఏం... ఆఫోటో అంత ముఖ్యమైనదా?'

'ముఖ్యమైనది కాదేంటి మరి?... మా అక్కా బావ అమెరికా వెళ్ళిపోయారుగా వాళ్ళదగ్గర నేను సింపుల్‌గా వున్న ఫోటో లేదని నన్ను ఫోటో తీయించుకుని పంపమన్నారు...'

'సింగిల్‌గా ఫోటో అని మరి డబల్‌గా ఫోటో ఎందుకు తీసుకున్నట్టో??...'

రాజారాం మళ్ళీ పళ్ళుకొరికి 'అమ్మో...' అంటూ దవడ పట్టుకున్నాడు బాధగా.

‘నొప్పెట్టిందంటే పెట్టదూ మరి?...మీకసలే పిప్పిపళ్ళున్నాయ్... ఎందుకలా పళ్ళుకొరుకుతున్నారు ఇందాకట్నుండీ?’ అంది సుశీల భర్త వంక జాలిగా చూస్తూ.

‘హు!...ఎందుకా?’

అతను మళ్ళీ పళ్ళు కొరికి ‘హబ్బా...’ అన్నాడు.

‘అవునుగానీ ఏంటి డబల్‌గా ఫోటో తీయించుకున్నానని అంటున్నారు?..నేను కార్డు సైజు ఫోటో ఇమ్మని చెపితే, వాడు పొరబాట్న కాబినెట్ సైజు ఫోటో ఇచ్చాడు!’ అంది సంతోషంగా ఆమె.

‘ఏంటో చూస్తావా?...’

బ్రీఫ్‌కేస్‌లోంచి కవరుతీసిభార్యచేతికిఇచ్చి పళ్ళుకొరికీ ‘హబ్బా...’ అన్నాడతను. దవడమీద చేయి పెట్టుకొని.

ఆమె కవర్లోంచి ఫోటో తీసి చూసింది.

ఆమెకళ్ళు ఆశ్చర్యంతో రెట్టింపయ్యాయి.

‘అ(రె!... ఎవరితను?’

‘‘అదే నేను అడుగుతున్నాను...ఎవడు వాడు...హబ్బా...’ అన్నాడు రాజారాం దవడకి చేయి ఆనిస్తూ.

‘బాగానేవుంది నాకేం తెల్సూ?’ అంది సుశీల కంగారు పడిపోతూ.

‘వాడెవడో తెలీకుండానే వాడితో ఫోటో తీయించుకున్నావా?...చెప్పు...ఎన్నాళ్ళనుండి సాగుతూందీ నాటకం?...’

‘హబ్బా...నాకేం పాపమూ తెలీదండీ అంటుంటే...ఆ రోజు నేను ఒక్కదాన్నే ఫోటో తీయించుకున్నాను.’

‘మరి వాడు నీ పక్కనెలా పడ్డాడు?’ రాజారాం పళ్ళు కొరికాడు.

‘ఉస్...హబ్బ...’

సుశీల సోఫాలో కూలబడింది. ఓ నిమిషం తర్వాత ‘ఆ..అర్థం అయింది’ అంది.

‘ఏం అర్థం అయ్యింది ...హబ్బ!’ అన్నాడు రాజారాం దవడ పట్టుకుంటూ.

‘ఆ రోజ ఫోటో తీయించుకోడానికి స్టూడియోకి వెళ్ళానా...ఆ స్టూడియో అబ్బాయేమో నన్ను నిలబడమని కెమేరా ఫోకస్ చేశాడు. ఇంతలో మరొకతను ఫోటో తీయించుకోడానికి వచ్చాడు. స్టూడియో అబ్బాయి ముందు నాకు ఫోటో తీస్తానని... అంతవరకూ అతన్ని ఓ పక్కగా నిలబడమని చెప్పాడు...’

‘ఊ...తరువాత?’ పళ్ళుకొరికి హబ్బా అన్నాడతను.

‘నేను కెమేరా ఫోకస్ లోకి రావడంలేదని కాస్త పక్కకి జరగమన్నాడు. నేను జరిగాను. ఇంకా జరగాలి అన్నాడు. నేను అలాగే జరిగాను. అలా పక్కకి పక్కకి జరగడంతో అతని దగ్గరికి వచ్చేశాను... అప్పుడు ఫోటో తీశాడు.’

'అసలు అతను నిన్ను జరగమనడం ఏమిటి? కెమేరాని జరపడమో నీవైపు తిప్పడమో చెయ్యొచ్చుగా...హబ్బా!!...!!'

'ఏమో మరి ... నాకేం తెల్సూ?'

'కనీసం వాడెవడో పక్కనున్నాడని ఫోటో తీసేప్పుడు అనొచ్చుగా... నీ నోరేం అయింది?'

'అందామని అనుకున్నానుగానీ అతను 'స్మైల్' అన్నాడు. అతనెక్కడ బటన్ నొక్కేసాడోనని భయమేసి నేను నవ్వాను. నవ్వేటప్పుడు ఏమైనా అంటుంటే ఫోటో తీసేస్తే నోరు తెరుచుకుని పడతానని భయమేసింది. అయినా అతనుకూడా ఫోకస్‌లోకి వస్తాడని నాకేం తెల్సూ?...'అంది ఆమె.

ఫోటోగ్రాఫ్ తెలివితేటలకు నవ్వొచ్చి ఫకాల్మని నవ్వాడు రాజారాం.

కానీ మరుక్షణంలోనే ఫోటోస్టూడియో అతను చేసిన పొరబాటు గుర్తొచ్చింది.

'హు...మా ఆవిడ్ని వేరే మగాడితో ఫోటోతీసి దాన్ని నాకే ఇస్తాడా ...చూడు వాడ్నేం చేస్తానో...' పళ్ళు కొరికి హబ్బా..అని దవడ పట్టుకున్నాడు అతను.

చిక్కడపల్లిలోనే....

మరొక ఇంట్లో....

అదే సమయంలో....

'కెవ్వ్వ్వ్...'

భయంకరంగా ఆ కేక గది గోడల మధ్య ప్రతిధ్వనించింది.

హాల్లో పేపర్ చదువుతున్న ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్ చటుక్కున కుర్చీలోంచి లేచి టేబులు సొరుగులోంచి రివాల్వర్ తీసి వరండాలో బులెట్‌లా దూసుకువచ్చాడు.

'ఎక్కడ దొంగ.... ఎక్కడ హంతకుడు ...ఎక్కడ ఎక్కడ ఎక్కడ?...'

రివాల్వర్‌ని పొజిషన్‌లో పట్టుకుని వరండాలో అటూ ఇటూ గబగబచూశాడు. అతనికి వణికిపోతూ కళ్ళలో కన్నీటి పోరుతో ముగ్గురు కూతుళ్ళూకనిపించారు.

'ఏంటి...ఏమైంది...ఏ దొంగగానీ ఇటు వచ్చాడా చెప్పండి...షూట్ చేసేస్తాను....'

ముగ్గురమ్మాయిలూ బావురుమన్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీ రామ్ కంగారుపడ్డాడు.

'ఏమైందమ్మా....ఏమైంది....ఏ కాలేజీ అబ్బాయైనా టీజ్ చేశాడా చెప్పండి.... షూట్ చేసేస్తాను....'

ముగ్గురు అక్కచెల్లెళ్ళూ చేతిలోది చూపించారు.

'ఏంటిది?....ఫోటోనా.... ఏముందదులో....'

వాళ్ల చేతుల్లోంచి ఫోటో తీసుకొని చూశాడు.

'ఎవరిదీ ఫోటో.....'

'మాదే నాన్నా....'

బావురుమన్నారు ముగ్గురూ.

'మీదా!!.... మరి వట్టి కాళ్ళున్నాయేం?' అన్నాడు ఇన్‌స్పెక్టర్ శ్రీ రామ్ ఆశ్చర్యంగా....'మోహాలేవీ?....'

'ఆ ఫోటో స్టూడియోవాడు అలా తీశాడు' అంది చిన్నకూతురు.

'మా ఆయనేమో రేపొచ్చి నన్ను తీసుకెళ్ళిపోతాడు. ఇదేమో వచ్చే వారం వాళ్ళాయనతో అమెరికాకి వెళ్ళి అక్కడ సెటిలయిపోతుంది. చిన్న దానికేమో పెళ్ళయి అదెటో వెళ్ళిపోతుంది....మళ్లీ వీలవదని ముగ్గురంకలసి ఫోటో తీయించుకుంటే వాడిలా తీశాడు' కళ్ళు తుడుచుకుంది పెద్ద అమ్మాయి.

'అసలు ఈ ఫోటోలు వాడి మొహానే కొట్టిరాక ఇంటికెందుకు తెచ్చావ్‌రా....' అంటూ మధ్యమ్మాయి తమ్ముడికి టెంకిజల్ల ఇచ్చింది.

'మమ్మల్ని నిలబడి ఫుల్‌గా తీయమంటే చూడునాన్నా ఫోటో ఎలాతీశాడో మోకాలునుండి పాదాలదాకా....' చిన్నమ్మాయి వెక్కింది.

ఇన్‌స్పెక్టర్ శ్రీ రామ్ చిందులు వేశాడు.

'ఎక్కడ....ఎక్కడ .... ఆ స్టూడియో ఎక్కడ... ఆఫోటో గ్రాఫరెక్కడ....షూట్ చేసేస్తాను....' రివాల్వర్ ని పొజిషన్‌లో పట్టుకుని అన్నాడు శ్రీరామ్.

ఇంకో ఇంట్లో...

'మీకు బుద్ధిలేదు' అంది ఆవిడ - తనకి భర్త.

'లేదు' తలొంచుకున్నాడు అతను ఆవిడకి భార్య.

'సిగ్గూ శరం లేదు'

'అవును....'

'తెలివితేటలంతకంటే లేవు...'

'కాదని నేనేనాడైనా అన్నానా!'

'ఛీ....'

'అను...'

'ధూ...'

'ఇంకా అను...'

బంగారంలాంటి సంబంధం మీవల్లే తప్పిపోయింది....'

'మధ్యలో నేనేం చేశాను?...'

'అమ్మాయి పోటో పంపించండి...నచ్చితే పిల్లని చూసుకోడానికి వస్తాం అని వాళ్ళు అన్నారు..అవునా?'

'అవును...'

'అలాంటప్పుడు ఫోటో ఎలా తీయించాలి?... మనమ్మాయిని చూడండి..అప్సరస!...'

'అవును... నీ పోలిక్కాదు'

'ఏమిటీ??...'

'ఏం లేదులే...'

'అలాంటిదాన్ని కోతిలాతీశాడు.... మంచి ఫోటో స్టూడియోలో తీయించక ఏదో ముదనష్టపు స్టూడియోలో తీయించారు.... అదే ఫోటో పెళ్ళివాళకి పంపించారు.... వాళ్ళేమో మీ అమ్మాయి మాకు నచ్చలేదని ఉత్తరం రాశారు.... అసలు వాళ్ళు వచ్చి చూసుంటే తెలిసేది అమ్మాయి ఎలాగుందో...'

'ముందే అమ్మాయిని చూడ్డానికి వస్తే రైలు ఛార్జీలు అవుతాయని ఫోటో పంపమన్నారు.... అలా చార్జీలక్కూడా మొహం చూస్కునేవాళ్ళ సంబంధ మనకెందుకులే....'

'ఏమిటీ?.... ఆ??!....'

'ఏం లేదులే...'

'చవటసన్నాసి దొరికారు ఎక్కడో'

'అవును....'

'బుద్ధిలేదు...'

'అవును...'

'అమ్మా... ఆ ఫోటో... దాని కాపీలూ... దాని నెగిటివ్.... అన్నీ కాల్చిపారెయ్యమని చెప్పమ్మా....' బావురుమంటూ ఏడుస్తూ తల్లిని కౌగిలించుకుని ఏడ్చింది పెళ్ళికూతురు.

'నువ్వూరుకో తల్లీ... వాడిపని నేను ఇప్పుడే పడ్తా...' అంటూ అప్పడాల కర్ర తీసింది ఆవిడ.

ఇలాంటి  సంఘటనలే చిక్కడపల్లిలో మరికొన్ని జరిగాయి....

వీటన్నిటికీ మూలకారణం ఒకే ఒక ఫోటో స్టూడియో.

అదే 'ఇస్మైల్ ప్లీజ్' ఫోటో స్తూడియో.

గంద్రగోళం

అదే చిక్కడపల్లి .....

జనం....జనం...జనం...

ఎక్కడ చూసినా జనం.

రోడ్లమీద జనం... సినిమా హాళ్ళలో జనం.... హోటళ్ళనిండా జనం... ఏ షాపు చూసినా జనం....

ఎక్కడనుండి పుట్టుకొస్తున్నారు ఇంత జనం!....

మగకి ఆడ, ఆడకి మగ గాలి తగుల్తే చాలు పుట్టేస్తున్నారు అని పిస్తుంది ఆ జనాన్ని చూస్తుంటే.

కానీ ఇంత కిక్కిరిసిన జనం ఉన్నా ... చిక్కడపల్లిలో ఒకే ఒక్క చోట జనంలేరు.... అది 'ఇస్మైల్ ప్లీజ్ ఫోటో స్టూడియో'.

టేబుల్ ముందు రాంబాబు తలకాయ్‌ని రెండు చేతుల్లో పట్టుకుని కూర్చున్నాడు. అతని ఎదురుగుండా కిష్టయ్య మరో కుర్చీల్లో కూర్చున్నాడు. వాడు టేబుల్ మీద వాలిన ఈగల్ని పట్టుకోవాలని ప్రయత్నిస్తున్నాడు.

రాంబాబు గాఢంగా నిట్టూర్చాడు.

'ఏంటండి గురూగారూ.... కట్టేసి వెళ్ళిపోదామా?' అన్నాడు కిష్టయ్య రాంబాబువంక చూస్తూ.

రాంబాబు రిస్ట్‌వాచ్‌వంక చూసాడు.

ఆరు గంటలైంది.

'అప్పుడేనా?...' అన్నాడు.

'ఊరికే కూర్చుని ప్రయోజనం ఏముందండి...' అన్నాడు కిష్టయ్య.

'ఎవరైనా వస్తారేమో...' అన్నాడు రాంబాబు గుమ్మం పైన చూస్తూ.

మధ్యాహ్నం నుండీ చూస్తున్నాం....ఒక్కరన్నా రాలేదు ఫోటో తీయించుకోడానికి. ఇంకెవరొస్తారు గురూగురూ.... సంగంలో జేమ్స్‌బాండ్ సినిమా ఆడ్తోందండీ... స్టూడియో కట్టేసి వెళ్దాం గురూగారూ....'

'షష్టో టైం అయిపోయిందిగా....'

'లేదండీ గురూగారూ...ఇంగ్లీషు సినిమా కదండీ ... ఆరున్నర్కి మొదలు...'

'ఇంకాస్సేపుచూద్దాం....'

మరొక్కసారి రిష్టువాచి వంక చూసుకుని వెనక్కి జారబడి ఆలోచనలో మునిగిపోయాడు రాంబాబు.

కిష్టయ్య మళ్ళీ ఈగలు పట్టే ప్రయత్నంలో మునిగిపోయాడు.

నిముషాలు గడుస్తున్నాయ్....

రాంబాబు దీర్ఘంగా నిట్టూర్చాడు.

'ఎంతపని చేశారండీ గురూగారూ...' అన్నాడు కిష్టయ్య బాధగా.

'ఏమైందిరా...' రాంబాబు కుర్చీలోంచి ముందుకు వంగుతూ కంగారుగా అడిగాడు.

'కొద్దిలో తప్పిపోయిందండీ...ప్చ్...' అన్నాడు కిష్టయ్య తల విదిలిస్తూ.

'ఏవిటి తప్పిపోయింది?'

'చేతికి చిక్కినట్టే చిక్కి తప్పించుకుంది గురూగారూ...'